


# ప్రజా న్యూస్ నెట్ వర్క్

దినపత్రిక

తెలంగాణ,ఆంధ్రప్రదేశ్,సంపుటి :01,సంచిక : 100,చీఫ్ ఎడిటర్ : వి.శివ కృష్ణ, వెల : 02,మంగళవారం, తేదీ : 11-08-2026

## పోలవరం ప్రాజెక్టుపై కేంద్రం కీలక ప్రకటన.. ఫేజ్ 1 పూర్తికి కొత్త డెడ్‌లైన్ ఖరారు..



ఆంధ్రప్రదేశ్ దశాబ్దాల కల పోలవరం ప్రాజెక్టు..

ఈ ప్రాజెక్టు నిర్మాణం 2027 మార్చి నాటికి పూర్తవుతుందని కేంద్ర ప్రభుత్వం తెలిపింది.

పోలవరం ప్రాజెక్టు ఫేజ్1 పూర్తికి గడువును మరో ఏడాది పొడిగించినట్లు కేంద్రం స్పష్టం చేసింది.

అమరావతి : రాజ్యసభలో ఎంపీ ఆర్ కృష్ణయ్య అడిగిన ప్రశ్నకు జలశక్తి శాఖ సహాయ మంత్రి రాజ్ భూషణ్ చౌదరి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. పోలవరం ఫేజ్-1 పూర్తికి గడువు 2027 మార్చి నాటికి పొడిగించారు. గతంలో 2026 మార్చి నాటికి ఫేజ్ 1 పూర్తి చేయాలని లక్ష్యం పెట్టుకున్నారు. మిగతా..2లో

## ఏపీ, తెలంగాణ సహా దక్షిణాదిలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు



రాబోయే కొద్ది రోజుల్లో దేశంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు

రాయలసీమ, తెలంగాణ, తమిళనాడులో ఉరుములు, మెరుపులతో కూడిన వానలు

హైదరాబాద్: : దక్షిణాది రాష్ట్రాల ప్రజలకు భారత వాతావరణ శాఖ (ఐఎండీ) గుడ్ న్యూస్ చెప్పింది. రుతుపవనాలు వేగం పుంజుకున్నందున రాబోయే కొద్ది రోజుల్లో కేరళ భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది. కోస్టల్ కర్ణాటక, లక్షద్వీప్‌లలో విస్తారంగా వానలు పడే అవకాశం ఉందని పేర్కొంది. ఎగువ కర్ణాటక, రాయలసీమ, తెలంగాణ, తమిళనాడులలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే ఛాన్స్ ఉందని వెల్లడించింది. మిగతా..2లో

## కోటి మందికిపైగా స్మార్ట్ రేషన్‌కార్డులు ఇవ్వబోతున్నాం



★ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈనెల 15న సంగారెడ్డి జిల్లాలో పర్యటించనున్నారు.

★సంగారెడ్డిలో నూతన స్మార్ట్ రేషన్ కార్డులను సీఎం పంపిణీ చేయనున్నారు.

సంగారెడ్డి, ఆగస్టు 10: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈనెల 15న జిల్లాలో పర్యటించనున్నారు. సంగారెడ్డిలో నూతన స్మార్ట్ రేషన్ కార్డులను సీఎం పంపిణీ చేయనున్నారు. ఈ సందర్భంగా (సోమవారం) తారా డిగ్రీ కాలేజీలో హెలిప్యాడ్, అంబేద్కర్ స్టేడియంలో సభ స్థలిని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ పరితోష్ పంకజ్ పరిశీలించారు. అనంతరం జగ్గారెడ్డి మాట్లాడుతూ... పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అరకొరగా రేషన్ కార్డులు ఇచ్చారని విమర్శించారు. కోటి 5 లక్షల మందికి కాంగ్రెస్ ప్రభుత్వంలో

## నాగార్జునసాగర్‌లో వైభవంగా ప్రారంభమైన

# మహా వరుణ యాగం’

●విస్తారంగా వర్షాలు కురవాలని తెలంగాణ ప్రభుత్వం వరుణయాగం

●108 మంది వేద పండితులు, రుత్వికుల ఆధ్వర్యంలో యాగం

●పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొననున్న సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్: రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురిసి, ప్రాజెక్టులన్నీ జలకళతో నిండాలని కాంక్షిస్తూ తెలంగాణ ప్రభుత్వం నాగార్జునసాగర్‌లోని విజయ్‌విహార్ ప్రాంగణంలో ‘మహా వరుణ యాగం’ ప్రారంభించింది. ఈ తెల్లవారుజామున నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి - పద్మావతి దంపతులు ఆదిపూజ నిర్వహించి యాగ క్రతువును శాస్త్రోక్తంగా ప్రారంభించారు. యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి చెందిన 108 మంది వేద పండితులు, రుత్వికుల ఆధ్వర్యంలో 11 హోమగుండాలతో ఈ మహాయాగాన్ని నిర్వహిస్తున్నారు. ఈ యాగం మధ్యాహ్నం 3 గంటలకు జరిగే పూర్ణాహుతి కార్యక్రమంతో ముగియనుండగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా హాజరై పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. ఈ క్రతువులో మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, కొండా సురేఖలతో పాటు స్థానిక ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొననున్నారు. డ్యామ్‌లు, చెరువుల్లో నీటిమట్టాలు పెరిగి రైతాంగం సుభిక్షంగా ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ ఆధ్యాత్మిక మార్గాన్ని ఎంచుకుంది.

## తెలంగాణ ప్రభుత్వం భరోసా.. 4.21 లక్షల మందికి గుడ్‌న్యూస్




●2026-27 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్రంలోని 4,21,767 మంది నమోదిత మత్స్యకారులకు గ్రూప్ ప్రమాద బీమా పథకం

●70 సంవత్సరాల వయస్సు గల 4,21,767 మంది నమోదిత మత్స్యకారులు ఈ పథకం పరిధిలోకి వస్తారని వెల్లడించారు.

హైదరాబాద్: మత్స్యకారుల సంక్షేమం, జీవనోపాధి భద్రత, సామాజిక రక్షణకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రమాదవశాత్తు మరణం లేదా శాశ్వత వైకల్యానికి గురైన మత్స్యకారుల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించాలనే ఉద్దేశంతో ఈ గ్రూప్ ప్రమాద బీమా పథకాన్ని అమలు చేస్తున్నట్లు చెప్పారు. 2026-27 సంవత్సరంలో 18 నుంచి 70 సంవత్సరాల వయస్సు గల 4,21,767 మంది నమోదిత మత్స్యకారులు ఈ పథకం పరిధిలోకి వస్తారని వెల్లడించారు. ఒక్కో లబ్ధిదారునికి మిగతా..2లో

## ప్రధాని మోదీ ప్రతిష్ఠ నాశనమైంది- అమిత్ షా రాజీనామా చేయాల్సిందే



★మోదీ ప్రభుత్వంపై తీవ్రంగా విరుచుకుపడ్డ లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ

★విద్యార్థులపై లాఠీఛార్జ్‌కు బాధ్యత వహిస్తూ అమిత్ షా రాజీనామా చేయాలని డిమాండ్

ఢిల్లీ : ఢిల్లీలో నిరసన తెలిపిన విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జ్ చేయడంపై లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ మండిపడ్డారు. స్టూడెంట్స్‌పై లాఠీఛార్జ్‌కు బాధ్యత వహిస్తూ కేంద్ర హోం మంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనతో ప్రధాని నరేంద్ర మోదీ ప్రతిష్ఠ నాశనమైందని ఆరోపించారు. దానిని తిరిగి పునర్నిర్మించలేరని పేర్కొన్నారు.

## పేరుకు మాత్రమే అది ఉపాధి హామీ పథకం

## అదంతా రోజ్‌గార్ ‘చోరీ‘-పై కాంగ్రెస్ ఫైర్

❖కొత్త గ్రామీణ ఉపాధి పథకంతో ఉద్యోగ కల్పన భారీగా తగ్గిందన్న జైరాం రమేశ్

❖జులైలో ఉపాధి కల్పన 49.94 శాతం తగ్గిందని ఆరోపణ

❖విద్యార్థులపై పోలీసుల దౌర్జన్యంపై అమిత్ షా ప్రకటన చేయాలని డిమాండ్

ఢిల్లీ : గ్రామీణ ఉపాధి హామీ పథకం విషయంలో కేంద్రంలోని మోదీ ప్రభుత్వంపై కాంగ్రెస్ తీవ్ర విమర్శలు చేసింది. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం స్థానంలో అమల్లోకి వచ్చిన వీబీ-జీ రామ్ జీ చట్టంపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ మండిపడ్డారు. ఈ కొత్త చట్టం పేరుకు మాత్రమే ఉపాధి హామీ ఇస్తోందని. వాస్తవానికి ఇది



రోజ్‌గార్ చోరీ అని ఆయన విమర్శించారు. జులై 2026లో కొత్త చట్టం అమల్లోకి వచ్చిన తొలి నెలలోనే గ్రామీణ ఉపాధి కల్పనలో భారీగా తగ్గుదల కనిపించిందని జైరాం రమేశ్ పేర్కొన్నారు. అధికారిక గణాంకాలను వెల్లడిస్తూ ప్రచురితమైన ఓ మీడియా కథనాన్ని ఆయన సోమవారం ఎక్స్ లో షేర్ చేశారు. 2025 జులైలో ఎంజీఎన్ఆర్ఈజీఏ అమల్లో ఉండగా లభించిన ఉపాధితో పోలిస్తే 2026 జులైలో కొత్త పథకం కింద ఉపాధి గణనీయంగా తగ్గిందని తెలిపారు.

### 49.94 శాతం తగ్గుదల

కొత్త చట్టం అమల్లోకి వచ్చిన తొలి నెలలోనే ఉపాధి కల్పనపై మిగతా..2లో

## విద్యార్థులపై లాఠీఛార్జీపై అమిత్ షా సమాధానం ఇస్తారు

# విపక్షాలు సభలోనే ఉండాలి

హోంమంత్రి సమాధానం చెప్పేంత వరకూ ఉభయసభల్లో నిరసన కొనసాగిస్తామని విపక్షాలు చెబుతున్న వేళ కేంద్రం నిర్ణయం



ఢిల్లీ : ఢిల్లీలో విద్యార్థులపై లాఠీఛార్జీకి సంబంధించి హోంమంత్రి అమిత్ షా సమాధానం ఇస్తారని కేంద్రం ప్రకటించింది. హోంమంత్రి సమాధానం చెప్పేంత వరకూ ఉభయసభల్లో నిరసన కొనసాగిస్తామని విపక్షాలు చెబుతున్న వేళ కేంద్రం ఈ మేరకు వెల్లడించింది. అయితే చర్చ, సమాధానం పూర్తయ్యే వరకూ విపక్షాలు సభలోనే ఉండాలని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు స్పష్టంచేశారు. చర్చలో పాల్గొంటున్న విపక్షాలు ప్రభుత్వం సమాధానం ఇచ్చే సమయంలో వాకౌట్ చేస్తున్నాయని విమర్శించారు. ఇది సరైన విధానం కాదన్నారు. “ప్రభుత్వ ప్రతిపాదన స్పష్టంగా ఉంది. విద్యార్థి ఉద్యమాలు, వాటికి సంబంధించిన కార్యకలాపాల గురించి పూర్తిస్థాయి, వివరణాత్మక చర్చ జరపడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పాను. ప్రతిపక్షాలకు చాలా స్పష్టంగా చెబుతున్న విషయం ఒకటే - సభలో చర్చ, సమాధానం ఇస్తున్నప్పుడు, సభ దృష్టిని మళ్లించడానికి లేదా హోంమంత్రి ప్రకటనను అడ్డుకోవడానికి వారు ఎలాంటి ఆటంకాలు కలిగించకూడదు. హోంమంత్రి, మిగతా..2లో

## మిగిలిపోయిన అర్హులకూ ‘నేతన్నల సేవలో’ పథకం కింద ఆర్థిక సాయం



★సీఎం చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా నేతన్నల సేవలో పథకానికి ఇటీవలే శ్రీకారం చుట్టామని మంత్రి సవిత తెలిపారు.

★71,536 మందికి రూ.25 వేల చొప్పున్న ఆర్థిక సాయం అందించామన్నారు.

అమరావతి, ఆగస్టు 10: సీఎం చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా నేతన్నల సేవలో పథకానికి ఇటీవలే శ్రీకారం చుట్టామని మంత్రి సవిత తెలిపారు. ఈరోజు(సోమవారం) రాష్ట్ర సచివాలయంలో నేతన్నల సేవలో పథకంపై మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంకా మిగిలిపోయిన అర్హులను గుర్తించి అందరికీ రూ.25 వేల ఆర్థిక సాయం అందించాలని ఆదేశించారు. అనంతరం మంత్రి మీడియాతో

## కరెన్సీ నోట్లకు ఉండే భద్రతా ఫీచర్లను

# పట్టాదారు పాస్ పుస్తకాలకు ఇస్తున్నాం

●పాస్ పుస్తకాన్ని ఎవరూ ట్యాంపర్ చేయకుండా తయారుచేశాం

●క్యూఆర్ కోడ్ కొడితే మీ సెల్‌ఫోనే మీ భూమి వద్దకు తీసుకెళ్తుంది

●‘మీ భూమి-మీ హక్కు‘ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు

అమరావతి : ప్రజా సమస్యల పరిష్కారమే తమ ఏకైక అజెండా అని సీఎం చంద్రబాబు అన్నారు.



సుపరిపాలనే తమ మొదటి ప్రాధాన్యత అని పేర్కొన్నారు. ఏలూరు జిల్లా కలిదిండిలో చంద్రబాబు పర్యటించారు. ‘మీ భూమి-మీ హక్కు’ కార్యక్రమంలో పాల్గొన్నారు. రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ప్రసంగించారు. “ప్రధాని మోదీ ఆధ్వర్యంలో రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కార్ సూపర్ స్పీడ్‌లో పరుగెడుతోంది. రాష్ట్రంలో రెవెన్యూ సమస్యలు పరిష్కారమయ్యే వరకూ అధికారులు గట్టిగా పని చేయాల్సిందే. పట్టాదార్ పాస్ పుస్తకంపై వేరే వాళ్ల ఫొటో వేసుకుంటే ఊరుకుంటామా? గత ప్రభుత్వ విధ్వంసం వల్ల అనేక సమస్యలు వచ్చాయి. భూసమస్యలపైనే ఎక్కువ అర్జీలు వచ్చాయి. ఎట్టి పరిస్థితుల్లో మిగతా..2లో

## లండన్ లో మంత్రి నారాయణ బృందం.. ఐకానిక్ భవనాల తుది డిజైన్లపై కీలక చర్చలు



●అసెంబ్లీ, హైకోర్టు, సచివాలయం వెలుపలి డిజైన్లపై చర్చించనున్న బృందం

●నార్మన్ అండ్ ఫోస్టర్స్, హఫీజ్ కాంట్రాక్టర్స్, బ్యూరో హాపోల్డ్ కన్సల్టెన్సీ, ఎల్ అండ్ టీ తో చర్చ

●అసెంబ్లీ భవనం పైభాగంలో నిర్మించే ఎత్తైన టవర్ డిజైన్‌పై ప్రధానంగా చర్చ

అమరావతి : ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో నిర్మించనున్న ఐకానిక్ భవనాల తుది డిజైన్లపై స్పష్టతనిచ్చేందుకు ఏపీ పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ నేతృత్వంలోని ఉన్నతస్థాయి బృందం లండన్‌లో పర్యటిస్తోంది. అసెంబ్లీ, హైకోర్టు, సచివాలయం (సెక్రటేరియట్) టవర్ల వెలుపలి డిజైన్ల ముసాయిదాను ఖరారు చేయడంపై మిగతా..2లో

ప్రజా న్యూస్ నెట్ వర్క్ దినపత్రిక

మంగళవారం 11-08-2026

మొదటి పేజి తరువాయి

# లండన్ లో మంత్రి నారాయణ బృందం.. ఐకానిక్ భవనాల తుది డిజైన్లపై కీలక చర్చలు

ఆర్కిటెక్ట్లు, ప్రముఖ కన్సల్టెన్సీ ప్రతినిధులతో మంత్రి నారాయణ కీలక సమావేశాలు నిర్వహించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఐకానిక్ భవనాల డిజైన్లు రూపొందించిన నార్మన్ అండ్ ఫోస్టర్స్, హఫీజ్ కాంట్రాక్టర్స్, బ్యూరో హాపోల్డ్ కన్సల్టెన్సీ, ఎల్ అండ్ టీ సంస్థల ప్రతినిధులతో ప్రత్యేకంగా భేటీ కానున్నారు. ముఖ్యంగా అసెంబ్లీ భవనం పైభాగంలో నిర్మించే ఎత్తైన టవర్ డిజైన్‌పై ప్రధానంగా చర్చ జరగనుంది. అమరావతి నగరాన్ని వీక్షించేలా దీనిని ప్రముఖ పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోంది. మంత్రి నారాయణతో పాటు సీఆర్డీయే కమిషనర్ విజయరామరాజు, అడిషనల్ కమిషనర్ అభిషేక్ కుమార్, చీఫ్ ఇంజినీర్లు ఈ లండన్ పర్యటనలో పాల్గొన్నారు.

# మిగిలిపోయిన అర్హులకూ 'నేతన్నల సేవలో' పథకం కింద ఆర్థిక సాయం

మాట్లాడుతూ.. 71,536 మంది నేతన్నలకు రూ.25 వేల చొప్పున్న ఆర్థిక సాయం అందించామన్నారు. ఇంకా మిగిలిన అర్హులైన నేతన్నలకు కూడా ఆర్థిక సాయం అందిస్తామని చెప్పారు. 13,678 మంది నేతన్నల సేవలో పథకానికి దరఖాస్తులు చేసుకున్నారని.. వారిలో అర్హులను గుర్తించి నేతన్నల నేస్తం పథకం వర్తింపజేస్తామని వెల్లడించారు. వారం రోజుల్లో మిగిలిపోయిన అర్హులకు కూడా రూ.25 వేల ఆర్థిక సాయం అందిస్తామని మంత్రి అన్నారు. నేతన్నలకు ఆర్థిక మేలు కలుగజేయాలన్నదే సీఎం చంద్రబాబు లక్ష్యమని తెలిపారు. 50 ఏళ్లు నిండిన 85,678 మంది చేనేతలకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు ఇస్తున్నామన్నారు. 62,541 మందికి నేతన్నల కుటుంబాలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని మంత్రి సవిత పేర్కొన్నారు. ఈ సమీక్షలో చేనేత, జౌళి శాఖ కమిషనర్ రేఖారాణి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఏపీ, తెలంగాణ సహా దక్షిణాదిలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు

ఆ వానలు పడే సమయంలో గంటకు 50-60 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని హెచ్చరించింది. ఈ మేరకు ఐఎండీ దేశంలోని వాతావరణ పరిస్థితులను వివరించింది. దేశంలో రుతుపవనాలు వేగం పుంజుకున్నందున హిమాలయన్ కొండలు, తూర్పు మైదానాలు, దక్షిణ తీర ప్రాంతాలలో వాతావరణం మారడంతో పలు రాష్ట్రాల్లో మరో విడత వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ ప్రకటించింది. త్వరలో దేశంలోని పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. ఈ భారీ వర్షాల వల్ల కొన్ని ప్రాంతాల్లో వరదలు వంటి విపత్తులు సంభవించవచ్చు చెప్పింది.

## ఐఎండీ ప్రకారం

దేశ రాజధాని ఢిల్లీలో ఆగస్టు నెల ప్రారంభంలోనే వర్షాలు దంచికొట్టాయి. కేవలం 8 రోజుల్లోనే నెలవారీ సగటు వర్షపాతాన్ని దాటేశాయి. మరోవైపు, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, జమ్మూకశ్మీర్‌ల్లో సోమవారం విస్తారంగా వర్షాలు కురుస్తాయని ఐఎండీ అంచనా వేసింది. రాబోయే ఐదు రోజుల్లో ఢిల్లీ, హరియాణా, చండీగఢ్, పంజాబ్‌లలో వర్షాలు పడే ఛాన్స్ ఉందని పేర్కొంది. తూర్పు రాజస్థాన్‌లో ఆగస్టు 11-12 తేదీలలో భారీ వర్షాలు పడే అవకాశం ఉందని స్పష్టం చేసింది. అలాగే ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్, బాగేశ్వర్, నైనితాల్, చంపావత్ సహా నాలుగు జిల్లాల్లో ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఈ ప్రాంతాల్లో భారీ వర్షాల సమయంలో పిడుగులు పడే అవకాశం ఉందని హెచ్చరించింది.

## మధ్య భారతదేశం

మధ్య భారతదేశం అంతటా వర్షపాతం పెరిగే అవకాశం ఉంది. ఈ వారంలో పశ్చిమ మధ్యప్రదేశ్, తూర్పు మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, విదర్భలలో భారీ వర్షాలు కురిసే ఛాన్స్ ఉంది. ఇటీవలే కురిసిన భారీ వర్షాల కారణంగా మధ్యప్రదేశ్‌లోని మాండ్లా, దిండోరి సహా పలు ప్రాంతాల్లో వరదలు సంభవించాయి. దీంతో నదులు, వాగులు పొంగిపొర్లుతున్నాయి. రోడ్లు జలమయమయ్యాయి. దీంతో దిండోరి, జబల్‌పూర్, అమర్‌కంటక్ హైవేపై భారీ ట్రాఫిక్ జామ్ అయ్యింది. కాగా, ఈశాన్య మధ్యప్రదేశ్, దానిని ఆనుకుని ఉన్న ఛత్తీస్‌గఢ్‌లో ఏర్పడిన అల్పపీడన ద్రోణి సోమవారం ఉత్తర మధ్యప్రదేశ్, దాని పరిసర ప్రాంతాలపై కేంద్రీకృతమవుతుందని భారత వాతావరణ శాఖ అంచనా వేసింది.

## తూర్పు భారతదేశం

తూర్పు భారతదేశంలోని బిహార్, ఝార్ఖండ్, ఒడిశా, బంగాల్, సిక్కింలలోని కొన్ని చోట్ల ఈ వారం అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. మరోవైపు, ఒడిశాలోని జాజ్‌పుర్, కేంద్రపారా ప్రాంతాలను వరదలు అతలాకుతలం చేస్తున్నాయి. ఈ వరద నీటిలో మునిగి ఇద్దరు వ్యక్తులు మరణించినట్లు తెలుస్తోంది. అక్కడ సహాయక చర్యలను సిబ్బంది, స్థానిక అధికారులు చేపడుతున్నారు.

## ఈశాన్య భారతదేశం

ఈశాన్య భారతదేశం వైపునకు రుతుపవనాలు చురుకుగా సాగుతున్నాయి. దీంతో ఆ ప్రాంతమంతటా విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ అంచనా వేసింది. అసోం, మేఘాలయలో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడే ఛాన్స్ ఉంది. అరుణాచల్ ప్రదేశ్, నాగాలాండ్, మణిపుర్, మిజోరం, త్రిపురలలో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పింది.

## పశ్చిమ భారతదేశం

పశ్చిమ భారతదేశంలోని కొంకణ్, గోవా, గుజరాత్‌లలో రుతుపవనాలు చురుకుగా పయనిస్తున్నాయి. దీంతో కొంకణ్, గోవా, గుజరాత్, మధ్య మహారాష్ట్రలలో ఆగస్టు 10న భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ పేర్కొంది. కొంకణ్, గోవాలో విస్తారంగా వర్షాలు పడే ఛాన్స్ ఉందని అంచనా వేసింది.

# కోటి మందికిపైగా స్మార్ట్ రేషన్‌కార్డులు ఇవ్వబోతున్నాం

స్మార్ట్ రేషన్ కార్డులు ఇవ్వబోతున్నామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ కమిట్‌మెంట్‌తో పని చేస్తోందని జగ్గారెడ్డి తెలిపారు. స్మార్ట్ రేషన్ కార్డులపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీఎం రేవంత్ రెడ్డి తీసుకున్న నిర్ణయం హర్షించదగిన విషయమన్నారు. ఇది ప్రభుత్వ కార్యక్రమమైనా కాంగ్రెస్ పార్టీ తరపున సీఎం రేవంత్‌కు ఘనంగా స్వాగతం పలుకుతామని చెప్పారు. సభని 50 వేల మందితో నిర్వహించేలా ఏర్పాట్లు జరుగుతున్నాయని జగ్గారెడ్డి పేర్కొన్నారు.

# తెలంగాణ ప్రభుత్వం భరోసా.. 4.21 లక్షల మందికి గుడ్‌న్యూస్




రూ.79.96 బీమా ప్రీమియం ఉండగా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 నిష్పత్తిలో ప్రీమియం భరిస్తాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా రూ.21,34,79,673 చెల్లిస్తుందని, తద్వారా అర్హులైన మత్స్యకారులపై ఎలాంటి ఆర్థిక భారం ఉండదని స్పష్టం చేశారు.

## బీమా పథకం ద్వారా అందే ప్రయోజనాలు:


ప్రమాదవశాత్తు మరణం సంభవిస్తే – రూ.5.00 లక్షలు
శాశ్వత సంపూర్ణ వైకల్యానికి – రూ.5.00 లక్షలు
శాశ్వత పాక్షిక వైకల్యానికి – రూ.2.50 లక్షలు
ప్రమాదవశాత్తు ఆసుపత్రిలో చికిత్స పొందితే – గరిష్ఠంగా రూ.25,000 వరకు వైద్య సహాయం

2026 జూన్ 1 నుంచి అమల్లోకి వచ్చే పాలసీ కాలంలో అర్హులైన ప్రతి నమోదిత మత్స్యకారుడికి నిరంతర బీమా రక్షణ అందేలా మత్స్యశాఖ అన్ని చర్యలు చేపట్టిందని మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. మత్స్యకారుల కుటుంబాలకు ప్రమాద సమయంలో అండగా నిలవడంతో పాటు, వారి భవిష్యత్తుకు ఆర్థిక భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి అన్నారు. మత్స్యకారుల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపడుతున్న అనేక కార్యక్రమాల్లో భాగంగా గ్రూప్ ప్రమాద బీమా పథకం కీలకమైనదని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నమోదిత మత్స్యకారులు, వారి కుటుంబాలకు సమగ్ర సామాజిక భద్రత, ఆర్థిక రక్షణ కల్పించేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు.

# కరెన్సీ నోట్లకు ఉండే భద్రతా ఫీచర్లను పట్టాదారు పాస్ పుస్తకాలకు ఇస్తున్నాం

మొదటి పేజి తరువాయి

భూసమస్యలను పరిష్కరించాలని అనుకున్నాం." "సమస్యలు పరిష్కరిస్తేనే జనాలు జై కొడతారు. లేకపోతే చూశాం కదా 11కి పరిమితం చేశారు. బటన్ నొక్కడం, పరదాల చాటున రావడం, సభలు పెట్టి చెట్లు నరికేయటం గత పాలకులు చేశారు. కానీ మేం ప్రతీ నెలా ప్రజల సమస్యలను తెలుసుకోవాలనే ఈ సమావేశాల ద్వారా ప్రజల్ని కలుస్తున్నాం. కరెన్సీ నోట్లకు ఉండే పటిష్టమైన భద్రతా ఫీచర్లను పట్టాదారు పాస్ పుస్తకాలకు కూడా అమలు చేస్తున్నాం. బ్లాక్ చెయిన్ టెక్నాలజీ ద్వారా ఆస్తుల వివరాలను ట్యాంపర్ చేయకుండా భద్రత కల్పించాం. క్యూఆర్ కోడ్ సహా ఇతర సాంకేతిక పరమైన భద్రతా ఫీచర్లను ఏర్పాటు చేశాం. 32.32 లక్షల పట్టాదారు పాస్ పుస్తకాలను ఇప్పటి వరకూ రైతులకు, భూ యజమానులకు అందించాం. 9365 గ్రామాల్లో రీసర్వే పూర్తి చేసి 68.64 లక్షల పాస్ పుస్తకాలు జారీ చేయాల్సి ఉంది" అని చంద్రబాబు వివరించారు. పాస్ పుస్తకాన్ని



ఎవరూ ట్యాంపర్ చేయకుండా : "7450 గ్రామాల్లో 32 లక్షల 22 వేల 346 పాస్‌పుస్తకాలు ఇచ్చాం. పాస్ పుస్తకాన్ని ఎవరూ ట్యాంపర్ చేయకుండా తయారుచేశాం. ఎవరైనా ట్యాంపర్ చేసేందుకు ప్రయత్నిస్తే వెంటనే తెలిసిపోతుంది. క్యూఆర్ కోడ్ కొడితే మీ సెల్‌ఫోనే మీ భూమి వద్దకు తీసుకెళ్తుంది. మరో ఏడు నెలల్లో మొత్తం పట్టాదార్ పుస్తకాలు పంపిణీ చేయాలి. 9,365 గ్రామాలు ఉన్నాయి, 68 లక్షల 64 వేలమందికి పాస్‌పుస్తకాలు ఇవ్వాలి. ఇవాళ 2 వేలమందికి పట్టాదార్ పాస్‌పుస్తకాలు ఇచ్చాం. గుంతల పడిన రోడ్లను ఎక్కడికక్కడ సరిచేస్తున్నాం" అని సీఎం చంద్రబాబు తెలిపారు. "ముఠా కక్షలు, రౌడీయిజాన్ని అణచివేశాం. రాయలసీమలో ముఠా కక్షలు లేకుండా రూపుమాపాం. రోడ్డుపైకి వచ్చి విన్యాసాలు చేస్తే ఊరుకోవాలా?. మేము కట్టిన ప్రాజెక్టులన్నీ జగన్ కట్టానని చెబుతున్నారు. గొడ్డలి పార్టీకి అభివృద్ధి ముఖ్యం కాదు, విధ్వంసమే వారికి కావాల్సింది. నేను రౌడీయిజం చేయను, రౌడీలకు సింహస్వప్నంగా ఉంటా. ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే ఎవరినీ వదిలిపెట్టం. స్వర్ణాంధ్ర నిర్మాణానికి సంకల్పం చేశా. నేను అనే సంకల్పానికి అందరూ సిద్ధంకండి. ప్రజా సంకల్పానికి సహకారం అందించే బాధ్యత మాది. వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర కల సాకారం కావాలి. అభివృద్ధికి ఎవరైనా అడ్డొస్తే ఊరుకునేది లేదు. జాతీయ జెండా – మనసులో సంకల్పం అజెండా. నేను – నా దేశం దేశాభివృద్ధిలో అందరూ భాగస్వాములే. ప్రతిఒక్కరూ ఒక మొక్క నాటండి."

# పోలవరం ప్రాజెక్టుపై కేంద్రం కీలక ప్రకటన.. ఫేజ్ 1 పూర్తికి కొత్త డెడ్‌లైన్ ఖరారు..

మొదటి పేజి తరువాయి

అయితే ప్రాజెక్టు నిర్మాణ పనులు ఇంకా తుది దశలో ఉన్నాయని నిర్మాణ గడువును మరో ఏడాది పొడిగించారు. కేంద్ర సహాయం ఫేజ్ 1కే పరిమితమని, అయితే సివిల్ పనులు ఫుల్ రిజర్వాయర్ లెవల్ 45.72 మీటర్ల వరకు కొనసాగుతాయని మంత్రి స్పష్టం చేశారు. పవర్ హౌస్ ఖర్చు మాత్రం రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని తెలిపారు. ప్రాజెక్టు పనులు షెడ్యూల్ ప్రకారం సాగుతున్నాయని, 2027 నాటికి ఫేజ్ 1 పూర్తి చేసి నీరు విడుదల చేసే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని కేంద్రం తెలిపింది.

### గత ఐదేళ్లలో 12,620.53 కోట్లు విడుదల చేసిన కేంద్రం

పోలవరం ప్రాజెక్టు జాతీయ ప్రాజెక్టు.. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం నిధులను కేంద్ర ప్రభుత్వమే భరిస్తుంది. పోలవరం ప్రాజెక్టు అథారిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టు నిర్మిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేసిన నిధులను బిల్లుల ఆధారంగా కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వానికి చెల్లిస్తుంది. ఈ మేరకు గత ఐదు సంవత్సరాల్లో (2021-26) కేంద్రం పోలవరం ప్రాజెక్టుకు మొత్తం రూ.12,620.53 కోట్లు విడుదల చేసింది. 2021-22 లో రూ.1,898.80 కోట్లు ,2022-23లో రూ.1,671.23 కోట్లు ,2023-24 లో రూ.727.88 కోట్లు ,2024-25 లో రూ.5,512.40 కోట్లు, 2025-26లో రూ.2,810.22 కోట్ల నిధులు విడుదల చేసింది. ఇప్పటికే ఫేజ్-1 సవరించిన అంచనా వ్యయం రూ.30,436.95 కోట్లకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇందులో బ్యాలెన్స్ సెంట్రల్ గ్రాంట్ రూ.12,157.53 కోట్లుగా ఉంది.

### పోలవరం పనుల పురోగతి  నిర్మాణ పనులు

పోలవరం ప్రాజెక్టు పనులు చివరి దశకు చేరుకున్నాయని కేంద్రం తెలిపింది. స్పిల్‌వే, ఎర్త్ కం రాక్‌ఫిల్ డ్యామ్ పనులు దాదాపు పూర్తి దశలో ఉన్నాయి. మిగిలిన కీలక పనులు గ్యాప్-1, గ్యాప్-2 ప్రధాన డ్యామ్ నిర్మాణం, భూసేకరణ, పునరావాసం,కొనసాగుతున్నాయి. స్పిల్‌వే (స్ట్రక్చర్) ఎర్త్‌వర్క్ 96.87 శాతం, కాంక్రీట్ పనులు 98.84 శాతం పూర్తయ్యాయి. స్టీల్ వర్క్ 92.95 శాతం పూర్తయ్యాయి. ఎర్త్ కం రాక్ ఫిల్ డ్యామ్ కనెక్టివిటీస్ లో ఎర్త్‌వర్క్ 75.56 శాతం, కాంక్రీట్ వర్క్ 81.99 శాతం, స్టీల్ వర్క్ 81.31 శాతం పూర్తయింది. ఇక ప్రధాన కాలువల ఎర్త్‌వర్క్ 98.96 శాతం, కాంక్రీట్ పనులు 88.44 శాతం, స్టీల్ వర్క్ 55.68 శాతం పూర్తయినట్లుగా కేంద్రం తెలిపింది

### నిర్వాసితులకు అండగా ఉన్నాం



పోలవరం నిర్వాసితుల విషయంలో ప్రభావితమయ్యే కుటుంబాల్లో ఇప్పటివరకు 17,892 కుటుంబాల తరలింపు పూర్తయింది. మొత్తం ప్రాజెక్టు నిర్వాసితుల సంఖ్య 96,660 కుటుంబాలుగా కేంద్రం తెలిపింది. ఇప్పటివరకు రిలీఫ్ అండ్ రీహాబిలిటేషన్ ప్యాకేజ్ కింద రూ.1,373.01 కోట్లు చెల్లించినట్లు, మొత్తం రిలీఫ్ అండ్ రీహాబిలిటేషన్ పనులకు సుమారు రూ.1,581 కోట్లు ఖర్చు చేయనున్నట్లు కేంద్రం వెల్లడించింది. కేంద్రం ఇచ్చిన ఈ సమాధానం ద్వారా పోలవరం ప్రాజెక్టు పురోగతి, నిధుల విడుదల, నిర్వాసితుల పునరావాసం వివరాలు స్పష్టమయ్యాయి.

# విద్యార్థులపై లాఠీఛార్జీపై అమిత్ షా సమాధానం ఇస్తారు- విపక్షాలు సభలోనే ఉండాలి

మొదటి పేజి తరువాయి

ప్రభుత్వ సమాధానాన్ని వారు వినాల్సిందే. చర్చ మొదలయ్యాక ప్రతి అంశాన్ని సమగ్రంగా చర్చించాలి."

### కిరణ్ రిజిజు, పార్లమెంటరీ వ్యవహారాలశాఖ మంత్రి

మరోవైపు విద్యార్థులపై జరుగుతున్న దారుణాల గురించి కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఎందుకు ప్రకటన చేయడం లేదని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రశ్నించారు. పార్లమెంట్ ఉభయ సభలు స్తంభించిపోవడానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఆయన ఆరోపించారు. విపక్షాలు చర్చను కోరుకుంటున్నాయని, కానీ ప్రధాని నరేంద్ర మోదీ, షా సభకు రావడానికి భయపడుతున్నారని ఖర్గే అన్నారు. అంటే తాము ఏదో తప్పు చేశామని వారికి తెలుసని దీని అర్థమని ఆయన వ్యాఖ్యానించారు. పార్లమెంట్ భవన సముదాయంలో విలేకరులతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. "మేము చర్చను కోరుకుంటున్నాం. ప్రభుత్వం ఎందుకు చర్చ జరపకూడదని అనుకుంటుంది? ఇతర అంశాలపై ప్రకటనలు ఇస్తారు కదా! మరి ఈ అంశంపై ఎందుకు ఇవ్వడం లేదు? మేము కేవలం ఒక ప్రకటన మాత్రమే అడుగుతున్నాం. దీనికి వారి దగ్గర సమాధానం లేదు. వారి వల్లే సభ జరగడం లేదు. దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాలి. అందుకు ప్రధాని మోదీ, హోం మంత్రి షా బాధ్యులు. పిల్లలపై జరిగిన అన్యాయాలపై అమిత్ షా సభకు వచ్చి ప్రకటన చేసేలా చూడటానికి మేము గత 17 రోజులుగా ప్రయత్నిస్తున్నాం. సమాధానం చెప్పడానికి సభకు రావడానికి బదులుగా ప్రధాని మోదీ రాత్రిపూట ఇన్‌స్టాగ్రామ్‌లో రీల్స్ చేస్తున్నారు. ప్రధాని పార్లమెంట్‌ను ఎందుకు విస్మరిస్తున్నారు? మోదీ, షా తమ ఇళ్ల నుంచే ప్రభుత్వాన్ని నడుపుతున్నారు. వారు గదుల్లో కూర్చుని అన్నీ వింటూ ఉంటారు. ప్రతిపక్షం మాట్లాడటానికి లేచిన వెంటనే సభలో గందరగోళం సృష్టించాలని తమ వారికి ఆదేశాలు ఇస్తుంటారు. చాలా బాధతో చెబుతున్నాను. రాజ్యసభ ఛైర్మన్ మమ్మల్ని కనీసం మా గళాన్ని వినిపించేందుకు అనుమతించడం లేదు. నాకు సమయం ఇస్తానని ఆయన అంటారు. ఆయన మాట నమ్మి నేను కూర్చుంటాను, ఆ తర్వాత వారు సభను వాయిదా వేస్తారు. ఇది సరికాదు."

### మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ అధినేత

విపక్షాల ఆందోళన మధ్యే లోక్ సభలో బిల్లుల ఆమోదం

ఇదిలా ఉండగా, విపక్షాల ఆందోళన మధ్యే ట్రిబ్యునల్ రిఫార్మ్స్ బిల్లు-2026ను లోక్‌సభ ఎలాంటి చర్చ లేకుండా ఆమోదించింది. దేశంలో వివిధ ట్రిబ్యునళ్ల ఛైర్‌పర్సన్లు,సభ్యుల నియామకాలకు ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేసేందుకు ఈ బిల్లును కేంద్రం ప్రవేశపెట్టింది. ఉదయం లోక్‌సభ సమావేశం కాగానే ఢిల్లీ విద్యార్థులపై లాఠీఛార్జీ అంశంలో కేంద్ర హోంమంత్రి సమాధానం చెప్పాలంటూ విపక్షాలు ఆందోళనకు దిగాయి. వారి ఆందోళన మధ్యే కేంద్ర మంత్రులు ట్రిబ్యునల్ రిఫార్మ్స్ బిల్లు-2026, మైన్స్ అండ్ మినరల్స్ అమెండ్‌మెంట్ బిల్లు 2026, కేరళ పేరు మార్పు బిల్లు-2026, నేషనల్ కోఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ బిల్లు-2026లను ప్రవేశపెట్టారు. తర్వాత లోక్‌సభ మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా పడింది. మధ్యాహ్నం 2 గంటలకు సభ తిరిగి సమావేశమైన తర్వాత కూడా సభ్యుల ఆందోళన కొనసాగింది. ఈ పరిస్థితుల మధ్యే కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్ బిల్లు ఆమోదం కోసం ప్రతిపాదించగా చర్చ లేకుండానే సభ ఆమోదించింది. అనంతరం లోక్‌సభ మంగళవారానికి వాయిదాపడింది. వర్షాకాల సమావేశాల్లో లోక్‌సభ ఇప్పటివరకూ 9 బిల్లులకు పచ్చజెండా ఊపగా రెండు మినహా మిగిలినవాటిని చర్చ లేకుండానే ఆమోదించింది.

# 'పేరుకు మాత్రమే అది ఉపాధి హామీ పథకం- అదంతా రోజ్‌గార్ చోరీ'

మొదటి పేజి తరువాయి

దాని ప్రభావం స్పష్టమైందని జైరాం రమేశ్ అన్నారు. గతేడాది జులైతో పోలిస్తే ఈ ఏడాది జులైలో ఉపాధి కోసం లభించిన పర్సన్-డేస్ 49.94 శాతం తగ్గినట్లు పేర్కొన్నారు. అలాగే ఉపాధి పొందిన గ్రామీణ కుటుంబాల సంఖ్య కూడా 51.45 శాతం తగ్గిందని తెలిపారు. మొత్తంగా గ్రామీణ ప్రాంతాల్లో కల్పించిన ఉపాధి దాదాపు సగానికి పడిపోయిందని ఆరోపించారు. ఎంజీఎన్ఆర్ఈజీఏను తొలగించి కొత్త వ్యవస్థను తీసుకురావడం వల్ల ఇలాంటి పరిణామాలు ఎదురవుతాయని కాంగ్రెస్, ఇతర ప్రతిపక్ష పార్టీలు ముందుగానే హెచ్చరించాయని జైరాం రమేశ్ అన్నారు. గ్రామీణ కార్మికులకు ఉపాధి కల్పించడమే కాకుండా, తమ హక్కులను చట్టబద్ధంగా డిమాండ్ చేసుకునే అవకాశం ఎంజీఎన్ఆర్ఈజీఏ కల్పించిందని ఆయన చెప్పారు. గ్రామ పంచాయతీలకు కీలక పాత్ర ఇవ్వడం ద్వారా గ్రామీణ ప్రజలకు ఉపాధి అవకాశాలు అందేలా పాత చట్టం పనిచేసిందని జైరాం రమేశ్ అన్నారు. ప్రభుత్వాల రాజకీయ నిర్ణయాలపై ఆధారపడకుండా గ్రామీణ కార్మికులకు ఉపాధి హామీ కల్పించడం ఎంజీఎన్ఆర్ఈజీఏ లక్ష్యమని పేర్కొన్నారు. అయితే కొత్త చట్టం ద్వారా పథకాన్ని కేంద్రీకరించారని కాంగ్రెస్ ఆరోపించింది. రాష్ట్ర ప్రభుత్వాలపై ఆర్థిక భారం పెంచడంతో పాటు సాంకేతికత, బయోమెట్రిక్ ధ్రువీకరణపై ఆధారపడేలా చేశారని జైరాం రమేశ్ విమర్శించారు. ఉపాధి హామీ స్వరూపమే దెబ్బతిందని, కార్మికులు తమ హక్కులను పొందడం మరింత కష్టంగా మారిందని అన్నారు. అందుకే 'వీబీ-జీ రామ్ జీ అంటే రోజ్‌గార్ చోరీ అని వ్యాఖ్యానించారు.

విద్యార్థులపై పోలీసుల చర్యలపై అమిత్ షా ప్రకటనకు డిమాండ్

ఇదిలా ఉండగా, దిల్లీలో విద్యార్థుల నిరసనల సందర్భంగా పోలీసుల చర్యలపై కాంగ్రెస్ మరోసారి కేంద్రాన్ని నిలదీసింది. ఈ అంశంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా పార్లమెంట్‌లో ప్రకటన చేయాలని కాంగ్రెస్ ఎంపీ కేసీ వేణుగోపాల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు వేణుగోపాల్ సోమవారం లేఖ రాశారు. దిల్లీలో ఆందోళన చేస్తున్న విద్యార్థులు, యువతపై పోలీసులు అధిక బలప్రయోగానికి పాల్పడ్డారన్న వార్తలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా నిరసనకారులపై పెల్లెట్ గన్స్ వినియోగించారన్న ఆరోపణలపై సమగ్ర విచారణ అవసరమని అన్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్న యువతపై చట్ట అమలు సంస్థలు కఠినంగా వ్యవహరించడం జాతీయ స్థాయిలో ఆందోళన కలిగించే అంశమని వేణుగోపాల్ పేర్కొన్నారు. దీనిపై పార్లమెంట్‌లో తక్షణమే చర్చ జరగాలని కోరారు. దిల్లీ పోలీస్ నేరుగా కేంద్ర హోంశాఖ పరిధిలో పనిచేస్తున్నందున అక్కడి పోలీసుల చర్యలకు హోంమంత్రి అమిత్ షా బాధ్యత వహించాలని వేణుగోపాల్ అన్నారు. రాజ్యాంగంలోని 77, 75(3) అధికరణలను ప్రస్తావిస్తూ కేంద్ర మంత్రివర్గం లోక్‌సభకు సమష్టిగా బాధ్యత వహిస్తుందని గుర్తు చేశారు. అందువల్ల విద్యార్థులపై జరిగినట్లు ఆరోపిస్తున్న పోలీసు దౌర్జన్యాలపై అమిత్ షా సభకు వచ్చి వివరణ ఇవ్వాల్సిన బాధ్యత ఉందని అన్నారు. మంత్రి స్వచ్ఛందంగా సభకు వచ్చి ప్రకటన చేయకపోతే పార్లమెంటరీ జవాబుదారీతనాన్ని కాపాడేందుకు స్పీకర్ తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. జులై 20న పేపర్ లీక్ అంశంపై విద్యార్థులు చేపట్టిన నిరసన సందర్భంగా పోలీసుల అతిగా వ్యవహరించారన్న ఆరోపణలపై ప్రతిపక్షాలు ఇప్పటికే లోక్‌సభ, రాజ్యసభల్లో అమిత్ షా ప్రకటన చేయాలని డిమాండ్ చేస్తున్నాయి. ఆ అంశంపై అధికార, ప్రతిపక్షాల మధ్య విభేదాలతో ఉభయ సభల్లో పలుమార్లు కార్యకలాపాలకు అంతరాయం ఏర్పడింది.

### కేరళ పేరు మార్పునకు బిల్లు

మరోవైపు, కేరళ రాష్ట్రం పేరును కేరళంగా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం లోక్ సభలో బిల్లు ప్రవేశపెట్టింది. కేంద్రం హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ సోమవారం కేరళ (పేరు మార్పు) బిల్లు- 2026ను సభలో ప్రవేశపెట్టారు. ప్రతిపక్షాల ఆందోళనల మధ్యే మళ్లీ బిల్లును తీసుకొచ్చారు. అయితే కేరళ అసెంబ్లీ రెండేళ్ల క్రితమే రాష్ట్రం పేరును కేరళం అని మార్చాలని తీర్మానం చేసింది. 2024 జూన్‌లో ఆ తీర్మానాన్ని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి పంపింది. అనంతరం రాష్ట్రపతి ఈ అంశంపై రాష్ట్ర శాసనసభ అభిప్రాయాన్ని కోరుతూ బిల్లును తిరిగి పంపారు. దీనిపై కేరళ శాసనసభ మరోసారి చర్చించి పేరుమార్పునకు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. ఇప్పుడు కేంద్రం దీనికి అనుగుణంగా పార్లమెంట్‌లో బిల్లును ప్రవేశపెట్టింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 3 ప్రకారం రాష్ట్రం పేరును కేరళ నుంచి కేరళంగా మార్చేందుకు రాజ్యాంగంలోని మొదటి షెడ్యూల్‌లో అవసరమైన సవరణలు చేయనున్నట్లు బిల్లులో పేర్కొంది.

# ప్రధాని మోదీ ప్రతిష్ఠ నాశనమైంది- అమిత్ షా రాజీనామా చేయాల్సిందే

ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, మరే ఇతర అధికారులు గానీ వారి చర్యల పర్యవసానాల నుంచి తప్పించుకోలేరని అన్నారు. ఓ జాతీయ వార్తాపత్రికకు రాసిన వ్యాసంలో రాహుల్ గాంధీ ఈ మేరకు మోదీ సర్కార్‌పై విమర్శనాస్త్రాలు సంధించారు. "జులై 20న దేశవ్యాప్తంగా వేలాది మంది యువత తాము ఎన్నుకున్న నాయకుడి నుంచి జవాబుదారీతనాన్ని ఆశించారు. కాస్త ఆలస్యమైనా యువతకు ఆ జవాబుదారీతనం లభిస్తుంది. జులై 20న దేశ యువత విద్యా వ్యవస్థ, పేపర్ లీక్‌లపై జవాబుదారీతనాన్ని డిమాండ్ చేస్తూ ఏకమయ్యారు. అన్ని కులాలు, వర్గాలు, ప్రాంతాలు, మతాలకు చెందిన విద్యార్థులు ఈ నిరసనల్లో పాల్గొన్నారు. న్యాయం కోసం డిమాండ్ చేసేంత ధైర్యం, తమ రాజ్యాంగ హక్కులను తెలుసుకునేంత వివేకం, పోరాడి గెలవగలమని నమ్మేంత నిబద్ధత విద్యార్థులకు ఉన్నాయి. నిరసనకారులు పాటలు పాడుతూ, నృత్యాలు చేస్తూ, నవ్వుతూ, చేతులు పట్టుకుని ఐక్యంగా నిలబడడాన్ని యావత్ దేశం ఆశ్చర్యంతో చూసింది. ఈ నిరసనలు భారతదేశపు గర్వించదగిన శాంతియుత ప్రతిఘటన వారసత్వాన్ని ముందుకు తీసుకువెళ్లాయి. ఈ సంప్రదాయమే దేశానికి స్వాతంత్ర్యాన్ని సాధించిపెట్టింది. "

### రాహుల్ గాంధీ, లోక్‌సభలో విపక్ష నేత

యువత గొంతును అణిచివేసే ప్రయత్నం : రాహుల్

శాంతియుతంగా నిరసన తెలుపుతున్న యువత గొంతుకను అణిచివేయడానికి మోదీ ప్రభుత్వం ప్రయత్నించిందని రాహుల్ ఆరోపించారు. స్టూడెంట్స్‌పై పోలీసులు టియర్ గ్యాస్ షెల్స్‌తో దాడి చేశారని మండిపడ్డారు. మేకులు దింపిన లాఠీలతో కొట్టారని, పెల్లెట్ గన్‌లతో కాల్పులు జరిపారని భగ్గుమన్నారు. లాఠీలతో యువతులపై దారుణంగా దాడి చేశారని విమర్శించారు. మైనర్లను లాఠీలతో కొట్టడంతో వారి ఎముకలు విరిగాయని తెలిపారు. అలాగే ఇంకొందరు తీవ్రంగా గాయపడ్డారని పేర్కొన్నారు. బిహార్‌లోని సివాన్‌లో నిరసన చేపట్టిన విద్యార్థులపై ఏకే-47తో సహా పలు తుపాకులతో కాల్పులు జరపడంతో చాలా మంది తీవ్రంగా గాయపడ్డారని వెల్లడించారు. ఈ చట్టవిరుద్ధమైన, రాజ్యాంగ విరుద్ధమైన హింసకు అధికారం ఎవరు ఇచ్చారు? అని ప్రశ్నించారు.

### 'మేము యువతకు అండగా ఉంటాం'

తమ భావ ప్రకటనా స్వేచ్ఛను వినియోగించుకున్న భారత యువతను క్షమిస్తున్నట్లు ప్రధాని మోదీ స్వయంగా ఒక వీడియో చేశారని రాహుల్ పేర్కొన్నారు. జవాబుదారీతనం కోరుతున్న తన సొంత ప్రజలనే ఒక ప్రధాని క్షమించడమేంటని ప్రశ్నించారు. విపక్షంలో ఉన్న తాము యువతతో నిలబడతామని చెప్పారు. "నరేంద్ర మోదీ ప్రభుత్వం తమ కేంద్రీకృత నియంత్రణ గురించి గొప్పగా చెప్పుకుంటుంది. అది అంగారక గ్రహ యాత్ర అయినా లేదా ఒలింపిక్ పతకం అయినా దాని ఘనత ప్రధాని మోదీ, అమిత్ షాలకే దక్కుతుందని పదేపదే వల్లె వేస్తుంది. మోదీ, షా ఆమోదం లేకుండా ఏదీ ముందుకు సాగదు. విద్యార్థులపై దాడి దిల్లీ నగరం నడిబొడ్డున జరిగింది. పార్లమెంట్‌కు కేవలం 500 మీటర్ల దూరంలో జరిగింది. అక్కడ మోహరించిన భద్రతా దళాలు, దిల్లీ పోలీసులు, రాపిడ్ యాక్షన్ ఫోర్స్ నేరుగా హోం మంత్రికి ఏదైనా విషయాన్ని నివేదిస్తాయి. విద్యార్థులపై దాడికి అమిత్ షా అధికారం ఇచ్చారు. విద్యార్థులపై దాడికి ఆయనే బాధ్యుడు. అందుకే షా తన పదవికి రాజీనామా చేయాలి. విద్యార్థులపై పోలీసుల లాఠీఛార్జ్‌పై షా ఎలాంటి విచారణకు ఆదేశించలేదు. కనీసం ఒక ప్రకటన కూడా విడుదల చేయలేదు. పార్లమెంట్‌కు రావడానికి నిరాకరించారు.

ప్రజా న్యూస్ నెట్ వర్క్ దినపత్రిక
మంగళవారం 11-08-2026

## ఆదుకున్న చేయి..నెల రోజులకు నిత్యావసర సరుకులు అందించిన జనసేన నేత దుంగ దేవన్ రాజు..



**ప్రజా న్యూస్, ఆగస్టు10: విశాఖపట్నం స్టాఫ్ రిపోర్టర్, పీ.ఎం.నాయుడు :**
పారిశ్రామిక ప్రాంతం జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం శెట్టి బలిజ వీధిలో యర్ర విజయలక్ష్మి , భర్త , ఇద్దరి పిల్లలతో నివాసముంటుంది, ఈ మధ్యకాలంలో అనారోగ్యంతో భర్త యర్ర జగదీష్ మృతి చందడంతో కుటుంబం విషాదంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు, ఆంధ్రప్రదేశ్ దేవాదాయ ధర్మాదాయ శాఖ,శ్రీ ఆంజనేయ స్వామి వారి దేవస్థానం (జింక్) ఆలయ ధర్మకర్త మరియు జనసేన పార్టీ 61 వ వార్డు అధ్యక్షులు దుంగ దేవన్ రాజు నెలవారి వార్డు పర్యటనలో విషయం తెలుసుకొని ఆ కుటుంబాన్ని పరామర్శించారు, జరిగిన విషయం తెలుసుకొని బాధపడ్డారు, సోమవారం అ కుటుంబానికి నెలకు సరిపడా నిత్యవసర సరుకులు అందజేశారు, అదేవిధంగా వారిద్దరి కుమారులకు చదువుకునేందుకు సహాయ సహకారాలు అందిస్తానని భరోసా ఇచ్చారు,ఈ కార్యక్రమంలో జె మోహన్, వీర మహిళ ఎన్ శంకరమ్మ, వెంకటేష్ ,శ్రీకాంత్,జనసైనికులు మరియు వీర మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

## బోనాల ఉత్సవాల్లో బీఆర్ఎస్ నాయకుల ప్రత్యేక పూజలు



**కుత్బుల్లాపూర్ ఆగస్టు 10 ప్రజా న్యూస్ నెట్వర్క్ :**
మాజీ కార్పొరేటర్ ప్రణయ్ ధనరాజ్ యాదవ్ మరియు మాజీ కోఆప్షన్ సభ్యులు సయ్యద్ సలీం సెకండ్ వెంకటేష్ తో కలిసి బి.ఆర్.ఎస్ పార్టీ ఆర్గనైజింగ్ సెక్రెటరీ సాంబశివారెడ్డి తన మిత్రులతో కలిసి వివిధ కాలనీ లలో అమ్మవారిని దర్శించుకుని పూజా కార్యక్రమాలు నిర్వహించి నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ ప్రజలు ఎల్లప్పుడుఆయుర్ ఆరోగ్యాలతో సుఖ సంతోషాలతో ఉండాలని అమ్మవారి ఆశీస్సులు కోరడం జరిగినది ఈ కార్యక్రమంలో కెసిఆర్ వీరాభిమాని సంగం అధ్యక్షులు జలగం చంద్రయ్య బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ మధు ప్రదీప్ నాయకులు శేఖర్ రాజు సంగం నర్సింగ్ యాదవ్ నరేందర్ ధర్మేంద్ర వెంకట్ టింకు సునీల్ రవీంద్రారెడ్డి మల్లారెడ్డి మహేష్ కురుమూర్తి అరుణ్ తిరుపతి ఎల్లం మరియు బిఆర్ఎస్ పార్టీ సీనియర్ మహిళా నాయకులు శ్రీమతి లలిత రెడ్డి భారతి బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు పాల్గొనడం జరిగినది.

## మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ నీ మర్యాదపూర్వకంగా కలిసిన పూజిత ఎన్క్లేవ్ నూతన కార్యవర్గం



**కుత్బుల్లాపూర్ ఆగస్టు 10 ప్రజా న్యూస్ నెట్వర్క్** :నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని బండారి లేఔట్ డివిజన్‌లో ఉన్న పూజిత ఎన్క్లేవ్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికల్లో నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు, కార్యవర్గ సభ్యులు కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్‌ను షాపూర్‌నగర్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ నూతన కార్యవర్గ సభ్యులను అభినందించి, శాలువాతో సన్మానించారు. పూజిత ఎన్క్లేవ్ కాలనీ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని ఆయన తెలిపారు. కాలనీకి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం తరపున తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు విద్యాసాగర్‌తో పాటు కార్యవర్గ సభ్యులందరికీ శ్రీశైలం గౌడ్ శుభాకాంక్షలు తెలిపారు. కాలనీ అభివృద్ధి, ప్రజల సమస్యల పరిష్కారానికి నూతన కార్యవర్గం సమన్వయంతో పనిచేయాలని ఆకాంక్షించారు.అదేవిధంగా నియోజకవర్గ పరిధిలోని పలువురు శుభకార్యాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికలు అందజేసి ముఖ్య అతిథిగా రావాలని ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో పూజిత ఎన్క్లేవ్ మాజీ అధ్యక్షుడు శరత్, అమర్, బెనర్జీ రాజు నరేంద్ర, వెంకట్ రాజు శ్రీనివాస్ రెడ్డి ఉదయ్ శివారెడ్డి, శ్రీనివాసులు రణధీర్, అరవింద్ యాదగిరి, ఏ.కె. రావు తదితరులు పాల్గొన్నారు.

## కొండాపురంలో డాగ్ స్క్వాడ్‌తో ముమ్మర తనిఖీలు

### కిరాణా దుకాణాలు, గ్లోబల్ ఇంటర్నేషనల్ పాఠశాల హాస్టల్‌లో పోలీసుల తనిఖీలు



**సూర్యాపేట జిల్లా ఆగస్టు 10 ప్రజా న్యూస్ నెట్‌వర్క్ షేక్ అబ్దుల్ రజాక్ జిల్లా ప్రతినిధి :**
హుజూర్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని చిలకూరు మండలం కొండాపురం గ్రామంలో పోలీసులు డాగ్ స్క్వాడ్‌తో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. గ్రామంలోని పలు కిరాణా దుకాణాలతో పాటు గ్లోబల్ ఇంటర్నేషనల్ పాఠశాల హాస్టల్ పరిసరాలను డాగ్ స్క్వాడ్ సిబ్బందితో క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనుమానాస్పద వస్తువులు, మత్తు పదార్థాల అక్రమ రవాణా, నిల్వలు, విక్రయాలపై ప్రత్యేకంగా పరిశీలన చేపట్టినట్లు సమాచారం. పాఠశాల విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని హాస్టల్ పరిసరాల్లోనూ నిశితంగా తనిఖీలు నిర్వహించారు. గ్రామంలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు తావులేకుండా ముందస్తు చర్యల్లో భాగంగానే పోలీసులు ఈ తనిఖీలు చేపట్టినట్లు తెలుస్తోంది.అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు కనిపించినప్పుడు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు.

## కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా కార్మిక వ్యతిరేక వ్యతిరేక విధానాలు నిరసనగా ర్యాలీ- శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి




**కుత్బుల్లాపూర్ ఆగస్టు 10 ప్రజా న్యూస్ నెట్వర్క్ :**
హైదరాబాద్ కేంద్ర బిజెపి. నరేంద్ర మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా కార్మిక రైతు.. వ్యవసాయ కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా, రాజ్ భవన్ ముట్టడి (జైల్ బరో) బిఆర్ టియు, రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి,సిఐటియు. ఏఐటియుసి కుత్బుల్లాపూర్ మండల కార్మికులు ఆధ్వర్యంలో.. ర్యాలీకి బయలుదేరుతున్న రాష్ట్ర అధ్యక్షులు రాంబాబు యాదవ్, కార్మిక నాయకుడు రవి, రాష్ట్ర కార్యదర్శి దేశ పాక్, ట్రాన్స్పోర్ట్ వర్కింగ్ ప్రెసిడెంట్ సాయి కుమార్, సంతోష్ కుమార్, సుదర్శన్, జగన్, కిరణ్, ధర్నాకు బయలుదేరుతుంటే అక్రమంగా కార్మిక నాయకులను అరెస్టు చేసి పంజాగుట్ట పోలీస్ స్టేషన్ కు తరలించారు... యూనియన్ కార్మికులు రవి మాట్లాడుతూ మాకు న్యాయం జరిగే వరకూ మేము కేంద్ర ప్రభుత్వంతో కొట్లాడుతూనే ఉంటామని తెలపడం జరిగింది... ఇలాంటి ఎన్ని ఎన్ని కుట్రలు చేసి అరెస్టులు చేసిన కార్మికుల కోసం మేము న్యాయం జరిగేదాకా పోరాటం చేస్తామని తెలిపారు...

## అర్హులైన ఒక్క ఓటు కూడా తొలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి - ముత్తినేని వీరయ్య



**సూర్యాపేట జిల్లా ఆగస్టు 10 ప్రజా న్యూస్ నెట్‌వర్క్ షేక్ అబ్దుల్ రజాక్ జిల్లా ప్రతినిధి** : హుజూర్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని 19వ వార్డులో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను వికలాంగుల హక్కుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య క్షేత్రస్థాయిలో సమీక్షించారు. మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు హుజూర్‌నగర్ నియోజకవర్గ ఎస్ఐఆర్ ప్రక్రియకు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న ఆయన 19వ వార్డు పరిధిలోని బూత్ నంబర్లు 224, 225లను సందర్శించి అక్కడ జరుగుతున్న ప్రక్రియ పురోగతిని పరిశీలించారు. బూత్ ఇన్‌చార్జులు అట్లూరి హరిబాబు, మంజుల, ఎండి. అజీజ్ పాషాలను కలిసి ఇప్పటివరకు చేపట్టిన కార్యక్రమాలు, ఓటర్ల వివరాల పరిశీలన, పెండింగ్‌లో ఉన్న అంశాలు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ముత్తినేని వీరయ్య మాట్లాడుతూ ఓటర్ల జాబితా పరిశీలనలో అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని, అర్హత కలిగిన ఒక్క ఓటు కూడా జాబితా నుంచి తొలగిపోకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. అర్హత ఉన్న ఓటర్ల వివరాలను పూర్తిస్థాయిలో పరిశీలించి, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ప్రక్రియను నిర్వహించాలని అన్నారు. అవసరమైన సందర్భాల్లో ఓటర్లకు నోటీసులు జారీ చేసే సమయంలో కూడా నిబంధనలను పూర్తిగా పాటిస్తూ, సంబంధిత వివరాలను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే తదుపరి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు హక్కు పరిరక్షించే విధంగా అధికారులు, బూత్ ఇన్‌చార్జులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియను నిర్ణీత గడువులోపు పూర్తి చేయడంతో పాటు ప్రతి వివరాన్ని జాగ్రత్తగా నమోదు చేయాలని, అనుమానాస్పదంగా ఉన్న అంశాలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి స్పష్టత పొందాలని సూచించారు. 19వ వార్డు పరిధిలో ఎస్ఐఆర్ ప్రక్రియను వేగంగా పూర్తి చేసేందుకు కృషి చేస్తున్న బూత్ ఇన్‌చార్జులను ఈ సందర్భంగా ముత్తినేని వీరయ్య అభినందించారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు నియోజకవర్గంలో ఎస్ఐఆర్ ప్రక్రియ సక్రమంగా, పారదర్శకంగా పూర్తయ్యేలా ప్రతి ఒక్కరూ బాధ్యతతో పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గెల్లి రవి, అట్లూరి హరిబాబు, బొడ్డు గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల హక్కుల కోసం హుజూర్‌నగర్‌లో గర్జించిన జైల్ భరో

### వెల్ఫేర్ బోర్డు నిధులు కార్మికులకే.. నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి






**సూర్యాపేట జిల్లా ఆగస్టు 10 ప్రజా న్యూస్ నెట్‌వర్క్ షేక్ అబ్దుల్ రజాక్ జిల్లా ప్రతినిధి :**
హుజూర్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని హుజూర్‌నగర్ పట్టణ ఇందిరా సెంటర్‌లో భవన నిర్మాణ కార్మికుల హక్కులు, సంక్షేమం, సమస్యల పరిష్కారం కోసం నిర్వహించిన జైల్ భరో కార్యక్రమం ఉధృతంగా సాగింది. సిఐటియు భవన నిర్మాణ కార్మిక సంఘం, స్వతంత్ర భవన నిర్మాణ కార్మిక సంఘం, ఏఐటియుసి భవన నిర్మాణ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి హుజూర్‌నగర్ మండలంలోని వివిధ గ్రామాలు, పట్టణ ప్రాంతాల నుంచి కార్మికులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, వారి సంక్షేమానికి సంబంధించిన నిధులను పూర్తిస్థాయిలో కార్మికుల కోసమే వినియోగించాలని డిమాండ్ చేస్తూ కార్మికులు పెద్దఎత్తున నినాదాలు చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని, కార్మికుల హక్కులు, ఉద్యోగ భద్రత, వేతన భద్రత, కార్మిక సంఘాల హక్కులను కాపాడాలని నాయకులు డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన వెల్ఫేర్ బోర్డు నిధులను ఇతర అవసరాలకు మళ్లించకుండా కార్మికుల సంక్షేమానికే వినియోగించాలని స్పష్టం చేశారు. సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న సంక్షేమ క్లెయిమ్‌లు, ప్రమాద పరిహారాలు, వైద్య సహాయం, పిల్లల విద్యా సహాయం, వివాహ సహాయం తదితర బకాయిలను వెంటనే విడుదల చేసి అర్హులైన ప్రతి కార్మికుడికి న్యాయం చేయాలని కోరారు. కార్మికుల చెమటోడ్చి సంపాదించిన డబ్బుతో ఏర్పడిన సంక్షేమ నిధులు కార్మికుల కుటుంబాలకు అండగా నిలవాల్సిన సమయంలో వాటిని ప్రైవేట్ ఇన్సూరెన్స్ సంస్థలకు మళ్లించడం సరికాదని నాయకులు తీవ్రంగా వ్యతిరేకించారు. కార్మికులకు నేరుగా ప్రయోజనం చేకూరే విధంగా వెల్ఫేర్ బోర్డు ద్వారానే సంక్షేమ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు ఉపయోగకరంగా లేని సీఎస్సీ హెల్త్ టెస్టులను రద్దు చేసి, ప్రతి కార్మికుడికి మెరుగైన వైద్య భద్రత కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికులు తమ శ్రమతో పట్టణాలు, గ్రామాలు అభివృద్ధి చెందేలా కృషి చేస్తున్నప్పటికీ వారి కుటుంబాల సంక్షేమం మాత్రం నిర్లక్ష్యానికి గురవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులు అనారోగ్యానికి గురైనా, ప్రమాదాలకు గురైనా, పిల్లల చదువులు, కుటుంబ అవసరాలు వచ్చినా సంక్షేమ పథకాల కోసం నెలల తరబడి ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వం ఇకనైనా కార్మికుల సమస్యలపై స్పష్టమైన నిర్ణయం తీసుకుని పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జైల్ భరో కార్యక్రమం సందర్భంగా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. హుజూర్‌నగర్ పోలీస్ స్టేషన్ ఎస్సై నరేష్ తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పర్యవేక్షించారు. నిరసనలో పాల్గొన్న పలువురు కార్మిక సంఘాల నాయకులు, కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకుని హుజూర్‌నగర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్టులతో తమ ఉద్యమాన్ని అణచివేయలేరని, కార్మికుల న్యాయమైన హక్కుల సాధన కోసం పోరాటాన్ని మరింత బలోపేతం చేస్తామని నాయకులు స్పష్టం చేశారు. కార్మికుల సంక్షేమ నిధులు పూర్తిగా కార్మికులకే దక్కే వరకు, పెండింగ్ క్లెయిమ్‌లకు నిధులు విడుదల చేసే వరకు, ప్రైవేట్ ఇన్సూరెన్స్ సంస్థలకు నిధులు మళ్లించే విధానాన్ని రద్దు చేసే వరకు, కార్మికులకు భారంగా మారిన అనవసర ఆరోగ్య పరీక్షల విధానాలను ఉపసంహరించే వరకు పోరాటం కొనసాగుతుందని హెచ్చరించారు. కార్మికుల సమస్యలను పరిష్కరించకుండా ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తే రానున్న రోజుల్లో మరింత పెద్దఎత్తున ఉద్యమాలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి యల్క సోమయ్య గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు లకావత్ బాలాజీ నాయక్, జిల్లా కమిటీ సభ్యులు జంజనం కోటేశ్వరరావు, కొమర రాజు, ధనావత్ నెహ్రూ, షేక్ సత్తార్, మహిళా కన్వీనర్ ములకలపల్లి పద్మ, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నవీన్ కాక, స్వతంత్ర భవన నిర్మాణ కార్మిక సంఘం పట్టణ అధ్యక్షులు షేక్ సైదా, బంక శ్రీనివాసరెడ్డి, వినాయక రావు, కే. ఏలియా, నాగుల్ మీరా, మన్యం సైదులు, ఏఐటియుసి భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు జెట్టి ప్రసాద్, అధ్యక్షులు ముడుసు పాపారావు, మేడం రాము, కందుల బిక్షం, బొప్పం రాజు, వీరస్వామి, బండారు స్వామి తదితరులు పాల్గొన్నారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించే వరకు ఐక్య పోరాటం కొనసాగుతుందని, కార్మికుల హక్కుల సాధన కోసం అవసరమైతే భవిష్యత్తులో మరిన్ని ఉద్యమ కార్యక్రమాలు నిర్వహిస్తామని నాయకులు స్పష్టం చేశారు.

## బోనాల పండుగ సందర్భంగా అమ్మవారిని దర్శించుకున్న నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి



**కుత్బుల్లాపూర్ ఆగస్టు 10 ప్రజా న్యూస్ నెట్వర్క్**
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగ సందర్భంగా నియోజకవర్గంలోని బాచుపల్లి, నిజాంపేట్ 2దీఙఖ , బండారి లేఔట్, మల్లంపేట్ ప్రాంతాల్లోని శ్రీ నల్ల పోచమ్మ, శ్రీ ఎల్లమ్మ ఆలయాల్లో నిర్వహించిన బోనాల ఉత్సవాల్లో ముఖ్య అతిథిగా పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, ఆనందంగా జీవించాలని, నియోజకవర్గంలో శాంతి, అభివృద్ధి, సౌభ్రాతృత్వం మరింతగా వెల్లివిరియాలని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి అమ్మవారిని ప్రార్థించారు.ఈ సందర్భంగా హన్మంతన్న మాట్లాడుతూ, బోనాల పండుగ తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి, ఘనమైన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. తరతరాలుగా కొనసాగుతున్న ఈ పవిత్ర పండుగను ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమాల్లో సీనియర్ కాంగ్రెస్ నాయకులు, డివిజన్ అధ్యక్షులు, మహిళా నాయకులు, యువజన నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అభిమానులు, ఆలయ కమిటీ సభ్యులు మరియు స్థానిక ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## 13 నుంచి "శ్రావణలక్ష్మీ ప్రత్యేక కుంకుమ పూజలు"





**విశాఖపట్నం, ఆగస్టు 10: ప్రజా న్యూస్, విశాఖపట్నం స్టాఫ్ రిపోర్టర్ పి.ఎం. నాయుడు :**
శ్రావణమాసం సందర్భంగా విశాఖపట్నంలోని శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో ఈ నెల 13వ తేదీ నుంచి సెప్టెంబర్ 11వ తేదీ వరకు "శ్రావణలక్ష్మీ ప్రత్యేక సామూహిక కుంకుమ పూజలు" నిర్వహించనున్నట్లు దేవస్థానం చైర్మన్ డాక్టర్ కందుల నాగరాజు తెలిపారు.దేవస్థానం ప్రాంగణంలోని తన కార్యాలయంలో ధర్మకర్తల మండలి సభ్యులతో కలిసి శ్రావణలక్ష్మీ ప్రత్యేక కుంకుమ పూజలకు సంబంధించిన బ్రోచర్‌ను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి, ఆలయ ప్రాంగణంలో వినాయక విగ్రహ ప్రతిష్ఠాపన, మార్గశిర మాసోత్సవాల నిర్వహణ, భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం, మరో అన్నదాన సత్రంలో ఏసీ సౌకర్యం ఏర్పాటు తదితర అంశాలపై ధర్మకర్తల మండలి సభ్యులు చర్చించారు.అనంతరం డాక్టర్ కందుల నాగరాజు మాట్లాడుతూ.. లోకకల్యాణార్థం, భక్తజనుల అభీష్టాలు నెరవేరేందుకు స్వస్తిశ్రీ చాంద్రమాన శ్రీ పరాభవ నామ సంవత్సర శ్రావణ శుద్ధ పాడ్యమి నుంచి ఈ ప్రత్యేక కుంకుమ పూజలను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 8 గంటల నుంచి పూజా కార్యక్రమాలు కొనసాగుతాయని పేర్కొన్నారు.విశాఖ దక్షిణ నియోజకవర్గ శాసనసభ్యులు వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ జ్యోతి ప్రజ్వలన చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని వెల్లడించారు.ఈ విశిష్ట సామూహిక కుంకుమ పూజల్లో పాల్గొనే దంపతులు మనమిత్ర వాట్సాప్ నంబర్ 9552300009, ఞఞ.ఖజ్ఞవఎ-జూశ్రీవం.శీతీస్త్ర.ఱఅ లేదా ఆలయంలో ఏర్పాటు చేసిన కియోస్క్ మెషీన్ల ద్వారా రశీదు పొందాలని చైర్మన్ సూచించారు.పూజల్లో పాల్గొనే భక్తులకు అవసరమైన పూజా ద్రవ్యాలను దేవస్థానం తరఫునే అందజేస్తామని తెలిపారు.గురువారం, శుక్రవారం రోజుల్లో మొదటి విడత పూజ ఉదయం 8 గంటలకు, రెండవ విడత పూజ 9.30 గంటలకు ప్రారంభమవుతుందని తెలిపారు. పూజలో పాల్గొనే భక్తులు తప్పనిసరిగా టికెట్ తీసుకురావాలని, టికెట్ లేని భక్తులకు పూజలో పాల్గొనేందుకు అనుమతి ఉండదని స్పష్టం చేశారు. ఒక టికెట్‌పై ఇద్దరికి మాత్రమే అనుమతి ఉంటుందని తెలిపారు.శ్రావణలక్ష్మీ కుంకుమ పూజలు చేయించుకునే దంపతులు పూజ ప్రారంభానికి 20 నిమిషాల ముందుగానే ఆలయానికి చేరుకోవాలని కోరారు. నిర్ణీత సమయం దాటిన తర్వాత వచ్చే భక్తులను పూజకు అనుమతించబోమని పేర్కొన్నారు. పూజలో పాల్గొనే మహిళలు చీర, పురుషులు పంచె ధరించి హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు.భక్తుల కొంగుబంగారమైన శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో పవిత్ర శ్రావణమాసంలో నిర్వహిస్తున్న ఈ శుభప్రదమైన సామూహిక కుంకుమార్చనల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీ అమ్మవారి ఆశీస్సులు, ఐశ్వర్యాలు పొంది సుఖశాంతులతో జీవించాలని డాక్టర్ కందుల నాగరాజు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో ఎన్. సుజాత, ధర్మకర్తల మండలి సభ్యులు టి. వేణికుమారి, ఎస్. రామారావు, సిహెచ్. మంజుల, ఆర్. శైలజ, ఎస్. అప్పారావు, కె. కళావతి, డి. శ్రీకాంత్, కె. అనూరాధ, కె. స్వరూపరాణి, ఎం. నాగసుధ, టి. నాగమణి, ప్రధాన అర్చకులు, ఎక్స్అఫీషియో సభ్యులు కె. శ్రీనివాస శర్మ తదితరులు పాల్గొన్నారు

## ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించిన రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య



**సూర్యాపేట జిల్లా ఆగస్టు 10 ప్రజా న్యూస్ నెట్‌వర్క్ షేక్ అబ్దుల్ రజాక్ జిల్లా ప్రతినిధి :**
హుజూర్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని హుజూర్‌నగర్ పట్టణంలోని 229వ బూత్‌లో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిని రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా బూత్ పరిధిలో ఓటర్ల వివరాల పరిశీలన, నమోదు ప్రక్రియ ఏ విధంగా కొనసాగుతోంది, అర్హులైన ఓటర్ల వివరాలు సక్రమంగా నమోదు అవుతున్నాయా అనే అంశాలను ఆయన సంబంధిత బూత్ స్థాయి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ప్రతి వివరాన్ని జాగ్రత్తగా పరిశీలించాలని, అర్హత కలిగిన ఒక్క ఓటు కూడా తప్పిపోకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఓటర్లకు సంబంధించిన వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అవసరమైన సమాచారాన్ని నిబంధనల ప్రకారం నమోదు చేయాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. ప్రజలకు ఎస్ఐఆర్ ప్రక్రియపై సరైన అవగాహన కల్పిస్తూ, అర్హులైన ప్రతి ఓటరుకు తమ ఓటు హక్కు విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు. ప్రక్రియను నిర్ణీత గడువులోపు పూర్తి చేసేలా సమన్వయంతో పనిచేయాలని, ఏవైనా సందేహాలు లేదా సమస్యలు ఎదురైతే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి వెంటనే పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులతో కూడా ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిపై చర్చించి, బూత్ స్థాయిలో జరుగుతున్న పనితీరును సమీక్షించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు గెల్లీ రవి, 229వ బూత్ బీఎల్ఏ కస్తాల దిల్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కస్తాల సైదులు, బీఎల్ఓలు గోవర్ధన్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

